# స్వరోచీయమ్

## దేశెట్టి కేశవరావు

'పెళ్ళంటే ఏమిటి?' అని స్వరోచిని అడిగా మనుకోండి. వెంటనే అతడు విశేష మేధో వాక్రుచ్చే మహావ్యాఖ్యానకుడి లాగా గొంతుకయినా సర్దుకోకుండానే-"పెళ్ళంటే నూరేళ్ళ తంటా" అని నిక్కచ్చిగా చెప్పివేయగలడు. "అనుభవం లేని విషయాలమీద ఇంత అభిప్రాయాలా?" అని ఎవరైనా నిగ్గదీస్తే, మీ వంక దుర్నిరీక్ష్యంగా చూ ̈సి, మీ నిశ్చలతా క్షేత్రాన్ని బీటలు వారేట్లు చేయగలడు.

'పెళ్ళంటే అయిష్టత ఉండేవాళ్ళు సవాలక్ష మంది ఉండొచ్చును. వాళ్ళు పెళ్ళిని ద్వేషించడానికి సవాలక్ష కారణా లుండవచ్చు. కానీ, ఇదేమిటి? స్వరోచి అన్న పేరు అసహజంగా ఉందే!' అని పాఠక మహాశయులు విషాదంగా ఈపాటికి తలలు వంకిస్తూ ఉంటారని తెలుసు. ఈ అభిప్రాయాన్నే-స్వరోచి చదివే లా కాలేజీలో ఒక బెంగాలీ ప్రొఫెసర్ మరో విధంగా చెప్పారు: "ఉచ్చారణా దుర్లభమైన పేర్లు ఉంచుకునే నేటి ప్రజలకు ఎలాంటి శిక్ష విధించాలో నిష్కర్షగా చెప్పకపోవడమే మన శిక్షాస్మృతిలోని గొప్ప లోపం" అని. అయితే, అధికారికమైన పేరుని పలకడం కష్టమన్నది వాళ్ళ అమ్మకు ఒక పెద్ద సమస్యగా తోచలేదు. కారణం ఆమె అతణ్ణి "రాజా" అనీ, "కృష్ణా" అనీ పిలుస్తూంటుంది. "స్వరోచీ" అని పిలిచిందంటే సదరు వ్యక్తి క్షమార్హం కాని నేరమేదో చేశాడనే అర్థం.

ఇదంతా చెప్పడం ఇంకా ఉదయం పది గంటలు కానందుకే. పది గంటలైతే లా కాలేజీలో క్లాసులు మొదలవుతాయి కదా! పదికి ఇంకా అయిదు నిమిషాలు ఉండటంచేత క్లాసు రూమ్‌ల ముందు వరండాలన్నీ కళకళలాడుతున్నాయి. ఒకచోట ఒక గుంపు మధ్యలో నిలబడి స్వరోచి తాను వకాల్తా పుచ్చుకున్న విషయంమీద వాదనలు దంచేస్తున్నాడు: "మజాకా కాదు. గ్రాఫాలజీ అన్నది మహత్తరమైన సైన్సు. దస్తూరీని బట్టి హంతకుణ్ణి గుర్తించవచ్చు. దస్తూరీని బట్టి అమాయకుణ్ణి గుర్తించవచ్చు. ప్రతి లాయరూ తప్పక తెలుసుకోవల "సిన సైన్సు ఇది!"

"అలాగా!" అన్నాడు. కోటేశ్వరరావు ఆశ్చర్యంతో.

"అవును! కొందరి చేతివ్రాత చూడగానే మనకి ఇరిటేషన్ కలుగుతుంది. కొందరి చేతివ్రాత చూడగానే మనకి ప్రశాంతత లభ్యమవుతుంది..."

ఇదే క్షణంలో మురళీధర్ వచ్చి, "ఒరేయ్ రేచీ! ఇదుగో నీ కో ఉత్తరం వచ్చింది" అని ఇచ్చాడు.

యథాలావంగా అడ్రసు చూ ̈సి, కవరుని చించే ప్రయత్నంలో ఉన్నాడు స్వరోచి. అందరూ నిశ్శబ్దంగా చూస్తున్నారు.

"కొందరి చేతివ్రాత చూడగానే చేతులు వణుకుతాయా"' అని అడిగాడు కోటేశ్వరరావు.






"ఆఁ... మరే! ఎముకలు కూడా విరుగుతాయి—ఎదుటివాళ్ళకి!" అని నాలుగు వాక్యాల ఉత్తరాన్ని చదివేశాడు స్వరోచి. "వస్తారా! అర్జంటుగా ఊరువెళ్ళాలి" అని కూడా అన్నాడు.

"ఇప్పుడు ప్రొఫెసర్ క్లాసుంది. ఎగ్గొట్టావంటే రాగల ఏడు జన్మలలోనూ లాయరువి కాలేవు" అన్నాడు రామయ్యచౌదరి.

"లేదు... లేదు. ఆయన్ని అడిగే వెళ్తాను. బై బడ్డీస్" అని బయలుదేరాడు.

"లేయ్! ఈ చేతివ్రాత విషయం పూర్తిగా చెప్పి వెళ్ళు!" వెనకనించి అరిచాడు సురేష్.

"అంతా ఒకేసారి చెప్తే అరిగించుకోలేవు. వచ్చేక మిగతావి చెబుతాలే!" అని భరోసా ఇచ్చి ఉప్పెనలా ముందుకి ఉరికాడు స్వరోచి.

క్లాసుకి వెళ్ళే సమయం దగ్గర పడుతూ ఉండడంవల్ల, తన గదిలో ఆ ప్రయత్నంలోనే ఉన్నారు ప్రొఫెసర్. టేబిలు దగ్గర నిలబడి, డస్టర్‌ను ఒకచేత పట్టుకుని పరధ్యానగా రెండు వేల పేజీల గ్రంథాన్ని సుద్దముక్క అనుకొని కోటు జేబులోనికి నెట్టాలని ప్రయత్నిస్తున్నారు.

తలుపు తెరుచుకొని గదిలోకి వచ్చి-"గుడ్మాణింగ్, సర్" అన్నాడు స్వరోచి.

ప్రొఫెసర్ తలెత్తి అతణ్ణి చూసి, "యూ ఆర్...?" అని ప్రశ్నార్థకంగా చూశారు.

"స్వరోచి, సర్, ఫైనలియర్ క్లాస్."

"ఎస్. అఫ్‌కోర్స్!" అన్నారు ప్రొఫెసర్ అకస్మాత్తుగా జ్ఞావకం వచ్చినట్టు. అప్పటికి ఆయనకి కొన్ని చాక్‌పీసులు లావుగా ఉండి, కోటు జేబుల్లో పట్టవని అర్థమై, ఆ ప్రయత్నాన్ని విరమించుకుని, దాన్ని బల్లమీద ఉంచేశారు. "ఫైనలియర్... ఎసఫ్‌కోర్స్, ఫైనలియర్!" అనికూడా అన్నారు. తర్వాత వారి సంభాషణ ఆంగ్లంలోనే జరిగింది.

"ఇప్పుడు మీ క్లాసుంది, సర్! నేను రాలేను. అర్జంటుగా ఊరికి వెళ్ళాలి. పర్మిషన్ ఇవ్వండి." రాజు అన్నాడు.

"వెల్. ను వ్వీ మధ్య నా క్లాసులకి సరిగా..." ప్రొఫెసర్ విచారంగా అన్నాడు.

"అదే, సార్! వివాహం విషయంగా నా అభిప్రాయాలు మీకు తెలును" అన్నాడు కృష్ణ. ఇది ప్రొఫెసర్ ఫేవరైట్ సబ్జక్టని కృష్ణకి అవగతమే.

"ఔనౌను. పెళ్ళికి సంబంధించినంతవరకూ నీ మెదడు సరైన స్థానంలోనే ఉందయ్యా! నాకు చాలా సంతోషం కలిగించే విషయాల్లో ఇది ఒకటి!" అన్నారు లా పుస్తకాలనే వివాహమాడిన ప్రొఫెసర్.

"అయితే, మాఅమ్మ మాత్రం డిఫెన్స్ లాయరులాగా నాకు ఎదురు నిలిచింది, సార్! ఇంటికి ఇప్పుడు అర్జంట్‌గా రమ్మని ఉత్తరం కూడా రాసింది!" ఉత్తరాన్ని గాలిలో ఊపుతూ అన్నాడు.

"వెళ్ళకపోతే?"

"షి రైట్స్ అబౌట్ టేరింగ్ మై డొక్క అండ్ మేకింగ్ ఇట్ ఇన్ టూ ఎ డ్రమ్, సార్!"

"మై గాడ్! ఎ డ్రమ్!" కొంచెం భయం లక్షణాలు ప్రొఫెసర్ ముఖంలో కనబడ్డాయి. "వై ఎ డ్రమ్? ఐ థింక్ షి మడ్ బి శాటిస్‌ఫైడ్ విత్ ద టేరింగ్."

"ఏమో, సార్! బహుశా ఆ డోలుని తీసుకొచ్చి కాలేజీ ముందు వాయించాలని ఆమె అభిప్రాయమై ఉండవచ్చు!" అన్నాడు స్వరోచి నిస్సహాయంగా.

"నో, నో! ఐ కాన్ట్ బేర్ దట్ వాయిస్. న్యూ సెన్స్ కేసు పెట్టి కోర్టుల చుట్టూ తిరగాలి. ఎవడు పడతాడా బాధ! యూ గో అవే, మై బాయ్, యూ గో అహెడ్" అన్నాడాయన.

"థాంక్యూ, సర్, థాంక్యూ!" అన్నాడు కృష్ణ వెళ్ళడానికి వెనక్కి తిరుగుతూ.

"చూడూ! కోటు జేబులో యీ చాక్‌పీస్..." అన్నారు ప్రొఫెసర్.

"అది చాక్‌పీస్ కాదండీ!" అన్నాడు రాజు.

ఆ మాటలతో ఆయనకి జ్ఞానోదయ మయింది. "ఆ, ఎస్! యూ ఆర్ రైట్!" అన్నాడు తేలికగా నిట్టూరుస్తూ. "మరైతే లా బుక్కు ఎక్కడ పెట్టానూ...?" టేబిల్‌మీద వెతుకుతూ అన్నారు.

ఆసరికి స్వరోచి కాలేజి మెట్లు దిగేశాడు.

** ** **

కొందరి దస్తూరీ చూడగానే వణుకు పుడుతుంది అనే అభిప్రాయాన్ని గ్రాఫాలజీ అనే శాస్త్రం అంగీకరిస్తుందో, లేదో తెలియదు. కానీ, అమ్మ ఉత్తరం చూడగానే రాజుకి-అంటే కృష్ణకి-వణుకు పుట్టడం మాత్రం నిశ్చయం. బహుశా గుండె గుర్రంలాగా గాలప్ చేస్తుందేమో కూడా!

చాలామందికి ఇది ఒక వింతగా తోచవచ్చు. "అమ్మా!...నీ...అనురాగం..." వగైరా వగైరా అంటూ కావ్యాలు రాసుకునే మామూలు కవుల చేతా, అక్షర వందలు సంపాయించే సినీకవుల చేతా ప్రస్తుతింపబడిన మాతృమూర్తి రాసిన ఉత్తరం కృష్ణలో—అంటే రాజులో— ఇలాంటి భయాన్ని కలిగించడం వింతే కదా-అనిపించవచ్చు.

అయితే సత్యం తెలుసుకుంటే ఈ సందేహాలు పటాపంచ లవుతాయి. రాజు అమ్మ అని పిలిచే వ్యక్తి అతణ్ణి దత్తత చేసుకుంది. ఆ కారణంచేత ఆమెకు అతనిపై వాత్సల్యం కూడా అతిమిక్కుటం. రాజే కనక సినీకవి అయి ఉంటే, "అమ్మా! నీ అనురాగం, రెండవ భాగం" అనే పాట రాసి, డిస్క్ కట్ చేసి, అక్షర వేలు—అదే, అక్షర సహస్రా లనుకోండి-ఆర్జించి ఉండును. కాని అయితే, ఆమె ఎంతటి అనురాగమూర్తో, అంతటి

కచ్చితమైన మనిషి అని రాజుకు తెలునన్న మాట. ఆమె ఆజ్ఞ అంటే అతనికి సుగ్రీవాజ్ఞ (స్త్రీ లింగం) అన్న మాట.

ఆరోజు రాజ్యంగారు అమీ తుమీ తేల్చివేయదలచుకున్నారు. అందుకే అష్టదిగ్గజాల లాంటి—ఐ మీన్, షష్టదిగ్గజాల లాంటి—అరడజను విద్వాంసులని సమావేశపరిచారు. ఆమె పరిశోధనా ప్రావీణ్యం మాట ఎలా ఉన్నా, ఆమె పాకశాస్త్ర నైపుణ్యంమీద నమ్మకంగల పండితులు విచ్చేసి, ఫలహారానంతరం సంతృప్తిగా హాల్లో కూర్చున్నారు. రాజ్యంగారు సోఫాలో కూర్చున్నారు.

"పదహారేళ్ళు—ఒకటీ, రెండూ కాదు—పదహారేళ్ళ పరిశోధనా ఫలితాలని జాగ్రత్తగా పరిశీలించవలసిందే కదా! ఏమంటారు? అసలు పెద్దన అన్న వ్యక్తి లేడు. అది రాయలు సృష్టించిన పేరు. రెండు కావ్యాలూ రాయలు రాసినవే!"

విద్వాంసులు ముసిముసిగా నవ్వారు. ఒకాయన మాత్రం —"అమ్మా! సాహితీ లోకంలో మరో విధమైన..." అనబోయాడు.

"అభిప్రాయం ఉండడానికి వీలులేదు!" అన్నారు రాజ్యంగారు, ఆ మాటని మధ్యలోనే తుంచేస్తూ.

"అమ్మో!" హాల్లోకి స్వరోచి వచ్చాడు.

"రాజూ! వచ్చావా! రా, నీ కోసమే ఎదురు చూస్తున్నా. ఇక్కడ కూర్చో!" అని సోఫాలో తన పక్కనే కూర్చోబెట్టుకున్నారు ఆమె.

"ముఖ్యమైన విషయం మాటాడుతున్నాం" అని వాళ్ళందరి వంకా ఆశ్చర్యంగా చూస్తున్న రాజుకి వివరించారు.

మళ్ళీ తన సంభాషణని కొనసాగిస్తూ- "ఎందుకంటారా! రుజువులు చూపిస్తాను. శాస్త్రీయమైన రుజువులు. కృష్ణదేవరాయలు, అల్లసాని పెద్దన, ఇద్దరి పేర్లలోనూ అక్షరాల సంఖ్య వొకటే. రాయలు పేరులో మొదటి అక్షరం క, ఇది హల్లుల్లో మొదటిది. పెద్దన పేరులో మొదటి అక్షరం అ. ఇది అచ్చుల్లో మొదటిది."

"అఁహ!" అన్నా డొకాయన.

"మిగతా అక్షరాలనీ ఇలాగే ఏదో రకంగా అన్వయించుకోవచ్చును."

"అంత మాత్రంచేత..."

"నేను చెప్పేది వినండి. ఈ రెండు పేర్లలోనూ ఒక్కొక్కదానికి ఎన్ని మాత్రలున్నాయి?"

"కృష్ణదేవరాయలు—పది మాత్రలు" అన్నా డొక పండితుడు.

"అల్లసాని పెద్దన—పది మాత్రలు." మరో పండితుడు చెప్పాడు.

"ఈ రకమైన సారూప్యత ఏక్సిడెంటల్ అంటారా? ఈ రుజువులు చాలవూ రాయలే పెద్దన అనడానికి! అయితే మనం వీటితో తృప్తి పడవద్దు. ఇంకా రుజువు లున్నాయి. చెప్తాను" అన్నదామె.

కా సేపు ఆగి స్వరోచిని చూపిస్తూ- "ఈ కృష్ణ ఉన్నాడే—వీడు అయిదేళ్ళ నలుసుగా ఉన్నప్పుడు..." గొంతు బొంగురు పోగా కళ్ళు చీరచెరుగుతో తుడుచుకుంది. కా సేపటికి తమాయించుకుని, "వీణ్ణి దత్తత తీసుకున్నాను నాకు దిక్కుగా ఉంటాడని." కళ్ళు తుడుచుకుంటూ అంది.

కొంచెం సేపు మౌనం వహించి మళ్ళీ మొదలెట్టింది. "వీణ్ణి నా చేతిలో పెడుతూ నా ఫ్రెండు అన్నది: 'రాజ్యం! నీకు సాహిత్య పరిశోధనే భర్తా, బిడ్డలూ, సంసారమూ ను. ఈ బిడ్డ నెలా పెంచుతావో!' స్విట్జర్లాండ్‌లో భర్తతో పాటు ఉన్న జ్యోతి నాకు ఇప్పుడు ఉత్తరాలు కూడా రాయదు. తనకి బాధ లేకపోయినా, తల్లీ బిడ్డల్ని నా స్వార్థంకోసం విడదీశా నన్నదే నా బాధ." మళ్ళీ చీర చెరగుతో కళ్ళు తుడుచుకుంది.

"నా ఫ్రెండు వీణ్ణి నాకు అప్పగించినప్పుడు, నే నేమనగలను? 'జ్యోతీ! రాయలు కావ్యం రాసి, పెద్దన పేరిట పెట్టినట్టు వీణ్ణి నా చేతికి అప్పగిస్తున్నావు (చీర చెరగుతో క.తు.) నువ్వు నిశ్చింతగా ఉండు. వీడి భారం నాది. ఈనాటినించీ వీణ్ణి స్వరోచి అని పిలుచుకుంటాను' అన్నాను" (మళ్ళీ చీ.చె.తో క.తు.)

"మీరేం బాధపడ నవసరం లేదు. అబ్బాయిని లక్షణంగా పెంచారు" అన్నది ఒక దిగ్గజం.

మిగతా దిగ్గజాలు అంగీకార సూచనగా తలలు పంకించాయి.

కా సేపిటికి తేరుకుని, రాజువేపు తిరిగి, "కృష్ణా! నువ్విలా, రా! నీతో మాటాడాలి!" అంది. అతిథుల వేపు తిరిగి, "క్షమించండి. రెండు నిమిషాల్లో వస్తాను. వెళ్ళిపోకండి!" అని పక్క గదికి దారి తీసింది.

రాజు ఆమె వెంటే నడిచాడు.

"ఏంటమ్మా! అంత అర్జంటుగా రమ్మని రాశావు. అవతలేమో ప్రొఫెసర్ ఇంక క్లాసులు తప్పిస్తే నా చర్మాన్ని క్లాసులో కార్పెట్ లాగా పరచాలని ఉవ్విళ్ళూరుతున్నాడు. ఇలాగైతే నాకేం డిగ్రీ వస్తుందీ?" అన్నాడు.

"డిగ్రీ దేముందిలే! నే చెప్పేది విను. విస్సాపురంలో వెంకటరత్నం అని ఉన్నాడు. మనకి బంధువులు కూడా. నీకు మేనమామ అవుతాడు. కుటుంబ కలహాలవల్ల వాళ్ళకీ, మనకీ చాలా రోజులనించీ రాకపోకలు లేవు. వాడి కో అమ్మాయి ఉంది. అర్థమైందా? నీ వల్లనే మన కుటుంబాలకి మళ్ళీ సఖ్యం కుదరాలి."

రాజుకి ఈ మాటలు వినగానే కోపం ఆకాశాన్ని అందుకుంది. "అమ్మా! నేను లాయరుగా స్థిరపడేవరకూ నా పెళ్ళి మాట ఎత్తవద్దని చెప్పానా, లేదా?"

"నువ్వెలాగో స్థిరపడతావు గానీ పెళ్ళికీ, దానికీ సంబంధ మేమిటో చెప్పు? 'మనుచరిత్ర'లో ఏమన్నాడు?"

"నాకు చరిత్ర అంటే ఇంట్రెస్టు లేదు. నా చరిత్రలో మాత్రం నా కప్పుడే పెళ్ళి జరగదు!" నిష్కర్ష చేశాడు.

"స్వరోచీ!"

రాజు తల వంచుకుని కా సేపు మౌనంగా ఉన్నాడు. తర్వాత- "విస్సాపురానికెలా వెళ్ళాలమ్మా?" అనడిగాడు.

ఆమె చెప్పింది.

"సరే బట్టలు సర్దుకుంటాను" అని వెళ్ళబోయాడు.

"బాబూ, కృష్ణా! ఇలా, రా! అన్నట్టు వెంకటరత్నానికి ఓ కొడుకు ఉన్నాడని విన్నాను. వాడితో కాస్త జాగ్రత్తగా ఉండు!" అంది రాజ్యం.

"అలాగే" అని తల ఊపాడు రాజు.

** ** **

చిన్న స్టేషనంటే పెద్ద రైలుబళ్ళు, తొంభై నిమిషాలూ, చిన్న రైలుబళ్ళు రెండు నిమిషాలు ఆగే ప్రదేశ మన్న మాట.

కృష్ణ రైలు దిగి సూట్‌కేసు దించుకోగానే, సింహం తరిమే కుందేలులాగా పరుగెత్తిందీ—అంటే రైలు; సూట్‌కేసు కాదు. అతడు చుట్టూ చూసేలోగానే, అక్కడ దిగిన అయిదారుగురు ప్రయాణీకులూ తలో దారిన వెళ్ళిపోయారు. గత్యంతరం లేక అక్కడ మిగిలి ఉన్న స్టేషన్ మాస్టర్ దగ్గరికి నడిచి, "విస్సాపురం ఎంత దూరమండీ?" అని ప్రశ్నించాడు.

అత డో కాలిబాట చూపించి- "అలా వెళ్ళండి! సుమారు ఓ కిలోమీట రుంటుంది" అనేసి, ఇంకే ప్రశ్నలకీ జవాబు చెప్పనన్నట్టు గదిలోకి వెళ్ళి గడియ వేసేసుకున్నాడు.

రాజు కాలిబాటన బయలుదేరాడు. చిక్కని పచ్చికా, పచ్చని చెట్లూ, స్వచ్ఛమైన గాలీ ఆహ్లాదకరంగా ఉన్నాయి. తొలకరి వానలు పడి ఉండడంవల్ల అక్కడక్కడా పొలాల్లో పనులు చేసుకుంటూ మనుషులు కనిపించారు. ఇంత మంచిదారిని చూపించినందుకు స్టేషన్ మాస్టర్ని మనసులోనే అభినందించాడు.



"అన్ని బాటలూ రోమ్ నగరానికి దారితీస్తాయి" అని ఓ ఆంగ్ల సామెత ఉందట. కానీ, రాజు ప్రయాణించే బాట మాత్రం ఓ బురదగుంటకి దారితీ°సింది. దాని లోతు తెలియక, దాన్ని తరించడానికి అతడు ప్రయత్నించడంతో పేంటుకంతా బురద అయిపోయింది. అ బుర దని కాస్తంత శుభ్రం చేసుకుని, తిరిగి నడక మొదలెట్టాలనుకుంటే అటువేపు దారి కనబడలే దు. తోచినట్టు నడవడం ఆరంభించాడు. సూట్కే °సు చేతిలో ఇనుప గుండులాగా బరువెక్కింది.

నాలుగు కిలోమీటర్లు నడిచాక అతడు విస్సా పురం వేపు కాక వియన్నావేపు నడుస్తున్నట్టు అనుమానం వచ్చింది. అక్కడ పొలం గట్టుమీద నిలబడి ఉన్న ఒక పెద్దమనిషిని దారి అడిగాడు.

"మం దేవూరు?" అనడిగా డతను.

చెప్పాడు.

"చదూకున్నట్టున్నావ్! ఆమాత్రం దారి తెలుసు కోలేకపోయావుటయ్యా?" అన్నా డా పెద్దమనిషి.

రాజు కేం తోచలేదు. తను రా°సిన ఇన్ని పరీక్షలలోనూ 'విస్సావురం పోవుటకు దారి నెట్లు కనుగొందువు?' అనే ప్రశ్న ఇచ్చినట్టు గుర్తులేదు. అదీకాక ఈ స్టేషన్ మాస్టర్లు ఉన్నారే! వీళ్ళే ప్రయాణీకులను కావాలని తప్పుదారి పట్టిస్తున్నా రు. విస్సావురానికి సరియైన దారి చెప్పగల స్టే షన్ మాస్టర్లు ఈ భూమిమీద లేకపోవడం రైల్వే శాఖయొక్క దౌర్భాగ్యం అనుకున్నాడు.

"ఎవరి తాలూకా ఏంటి?" అని అడిగా డాయన.

"వెంకటరత్నంగారి ఇంటికండీ!"

"ఓహో! రాజ్యం కొడుకువేంటి? నీ పేరేదో ఉండాలే!"

"ఉందండీ!"

"ఒరే, అప్పన్నా! రాకెట్టుగాణ్ణి చూశావా?" అని అడిగా డాయన పనివాళ్ళవేపు తిరిగి.

ఆ రాకెట్టు ఏదో ఒక చెట్టుమీదికి ఎక్కి ఉంటుందనీ, బహుశా గూడో, గుడ్లో సంపా దించడం దాని ఉద్దేశం అయి ఉంటుందనీ జవాబొచ్చింది.

"వా డొస్తే మీ వెంట తరుముతా గానీ, అబ్బాయిగార్ని రత్నం ఇంటికి తీసుకెళ్ళు!" అని హుకుం చేశా డాయన.

మరో మాట మాటాడకుండా అతడితో బయలు దేరాడు రాజు.

కొంత దూరం వెళ్ళేసరికి బాణంలా దూసు కుంటూ ఓ కుర్రా డొచ్చి కలిశాడు. "నువ్వేనా మా బావవి?" అనడిగాడు రాజుని.

రాకెట్టుతో పరిచయం సంపాదించుకున్నానని కృష్ణ గ్రహించాడు. కృష్ణ "ఆఁ!" అని నవ్వి ముందుకి నడిచాడు. బొద్దుగా, ముద్దుగా ఉన్న ఆ కుర్రాణ్ణి చూ°సేసరికి రాజుకి అభిమానం పొంగింది.

"బావా! బురదగుంటలో పడ్డావేంటి?" అనడిగా డు రాకెట్టు.

రాజు నవ్వి, వాడి జుత్తు మృదువుగా చెరిపి "పడలేదు" అన్నాడు.

కా°సేపు ఆగి, "నీకు ఈత వచ్చా?" అనడిగాడు రాకెట్టు గుడ్లు పెద్దవి చేసుకుని.

"ఊఁ!" అన్నాడు రాజు.

"అయితే రేపు పొద్దున్నే చెరువు కెళ్దాం!" అన్నాడు.

ఇంత కలివిడిగా, నిస్సంకోచంగా మాట్లాడేవాణ్ణి చూ°సేసరికి రాజుకి చాలా ముచ్చట వే°సింది. "నీ పేరేమి టన్నావ్?" అని అడిగాడు.

"బాతు గుడ్లలోనే కొంగలు గుడ్లు పెడతాయి తెలుసా! నిన్న నా కొక కొంగగుడ్డు దొరికింది." కోహినూర్ వజ్రం దొరికినంత ఆనందంతో చెప్పా డు రాకెట్.

"అలాగా! ఇంతకీ నీ పేరు?"

"ఈత కొడుతున్నప్పుడు ఎవరినయినా నీళ్ళలో ముంచాలంటే ఎలాగో తెలుసా?"

రాజు ఈ ప్రశ్నల వేగానికి తట్టుకోలేకపోతున్నా డు. మనోవేగం సంగతి అతడు విని ఉన్నాడు గానీ, ఇంత వేగంగా ఉంటుందని ఇప్పుడే తెలి°సిం దతడికి. అసలే ఎండలో నడిచి శోష వచ్చినట్టుంది. దానికితోడు ఈ యక్ష ప్రశ్నలు.

"తెలియదు" అన్నాడు కాస్త విసుగుతోపించే స్వరంతో.

"తెలీదా?" ఆశ్చర్యంగా చూశాడు రాకెట్టు.

కృష్ణ మౌనంగా నడుస్తున్నాడు. "ఎలాగో చూ పిస్తా నుండు. కాస్త నిలబడు!" అని రాకెట్టు దూరంగా వెళ్ళి, పరిగెత్తుకొని వచ్చి రాజుమీదికి ఎగిరాడు. అతడి బుజా లందక చొక్కా మాత్రం పట్టుకొని, కాళ్ళని పేంటుమీద ఆనించి, పట్టు దొరకక జారి పడ్డాడు. దానితో వాడి కాళ్ళకి ఉన్న



బురద అంతా కృష్ణ చొక్కాకీ, పాంటుకీ అంటుకుంది. వాణ్ణి చాచి లెంపకాయ కొడదామన్నంత కోపం వచ్చింది రాజుకి. కానీ, బాగుండదని ఎలగో తమాయించుకున్నాడు. అనలే బుదతో ఖరాబు అయిన పాంటు ఇప్పుడు అనవ్యాంగా తయారయింది. దానికితోడు చొక్కా కూడా పాడయింది.

కిందపడిన రాకెట్టు లేచి, వక్కన పడిపోయిన గూడుని అందుకుని, "ఇది కోయిల గూడు తెలుసా!... పొద్దుటినించీ వెతికితే ఇది దొరికింది" అన్నాడు ఏమీ జరగనట్టే.

"నోరు మూసుకుని నడవవోయ్" అన్నాడు కృష్ణ. వాణ్ణి చూస్తుంటే అతడికి ఒళ్ళు మండుతోంది. వెంటనే అమ్మ ఇచ్చిన వార్నింగ్ కూడా అతడికి జ్ఞాపకం వచ్చింది. ఈ తుంటరి వెధవని తాను ముద్దు చేయబోయాడు. వీణ్ణి కొన్త దూరంగా ఉంచాలనుకున్నాడు.

"నీకు శీర్షాసనం వెయ్యడం వచ్చా, బావా?" అని అమాయకంగా అడిగాడు రాకెట్టు.

కృష్ణకి కోపం పెచ్చుమీరిపోతోంది వాడి మాటలు వింటోంటే. "నోర్మ్ముయ్యవోయ్! వెధవ వాగుడూ, నువ్వూను" కఠినంగా అన్నాడు కృష్ణ.

"రాదా?" ఆశ్చర్యంగా చూశాడు రాకెట్టు.

వాడు అలా చూ సేటప్పటికి రాదంటే వాడికి లోకువ అయిపోతానని, "వచ్చు" అన్నాడు బింకంగా కృష్ణ.

"నాకు నేర్పిస్తావా?"

"నేర్పిస్తాలే. నోరు మూ సుకుని నడు."

ఊరి దగ్గరికి వచ్చేటప్పటికి వీధి మొదలులో ఆడుకునే కొక్కిరాయి కుర్రవాళ్ళు 'ఎవరు?' అన్నట్టు కళ్ళతోనే రాకెట్టుని ప్రశ్నించడం రాజు గమనించాడు. రాకెట్టు దర్జాగా నడుస్తూ, "మా బావ!" అని వాళ్ళకి గట్టిగా చెప్పాడు. మళ్ళీ వాళ్ళు ఏమైనా అపార్థం చేసుకుంటారని—"బురద గుంటలో పడ్డాడు" అని కూడా వివరణ ఇచ్చాడు. క్షణాల్లో ఈ వార్త వీధి కొసకంటా ప్రాకిపోయింది. "నోరు ముయ్యమన్నానా!" అని కృష్ణ వాణ్ణి కసురుకొని, పాలేరుతో నడిచాడు.

కా సేపటికి ఇంటికి చేరుకున్నారు. నడవాలో కూర్చున్న మనిషిని చూ సి వెంకటరత్నం అయి ఉంటాడని ఊహించి, "నమస్కారం, మామయ్యా! నా పేరు కృష్ణ. మా అమ్మ రాజ్యం..." అన్నాడు.

"తెలుసులేవోయ్! నీ పరిచయం అయిందప్పుడే. ఎవరో కుర్రాడు వచ్చి చెప్పాడు" అన్నాడు వెంకటరత్నం.

"తెలుయదేమో అనుకొనీ..." న సిగాడు రాజు.

"నువ్వు బురదగుంటలో పడిన సంగతి కూడా తెలి సిందోయ్. సర్లే! నీ వాలకం చూస్తుంటే నిన్ను కొత్త పాలేరు అనుకోగలరు. స్నానం గానీ!" అన్నాడు.

ఓ ఆవిడ—అత్తయ్య అయి ఉంటుందని ఊహించాడు—గుమ్మంలోంచి "రా, నాయనా!" అని పిలిచింది.

కాఫీ, టిఫిన్లకి కూర్చున్నారు. వీళ్ళ ఆప్యాయతని చూస్తోంటే కృష్ణకి కంపరమెత్తుతోంది. వీళ్ళు నిజంగా బిడ్డనిచ్చి తనకి పెళ్ళి చే సేటట్టున్నారు. విధి వ్రాత ఎలాగుంటుందో గ్రాఫాలజీ పుస్తకంలో రాయలేదు కదూ!

కాఫీ తాగుతుంటే మామయ్య—"మీకూ, మాకూ రాకపోకలు ఆగిపోయి పదిహేడేళ్ళు అయింది. మీ అమ్మ నాకు చెల్లెలై ఉండికూడా నా మాట విననప్పుడే మీకూ, నాకూ బాంధవ్యం తెగిపోయింది" అన్నాడు.

"మీ మాట వినకపోవడమా!" ఆశ్చర్యపోయాడు కృష్ణ.

"అయితే, నీ కీ సంగతులు తెలియవన్న మాట! నిక్షేపంలాంటి సంబంధాన్ని కష్టపడి తె స్తే కాదన్నది మీ అమ్మ."

"అమ్మకి పరిశోధనపై మోజు..."

"అలా చెప్తే బాగానే ఉండును. పెళ్ళి వద్దనడానికి కారణం అది కాదు కదా!"

"మ రేంటి?"

"పెళ్ళికొడుకు పేరు నచ్చలేదట!"

"పేరు నచ్చలేదా? ఆశ్చర్యంగా ఉందే! ఏం పేరు?"

"పెద్దన్న."

రాజుకి పరి స్థితి అవగాహన అయింది. కా సేపాగి, "ఆ పేరు ఉంటే అమ్మ ఒప్పుకోదు" అన్నాడు.

"ఎందు కలా అంటున్నావ్?"

"ఏమో నా కలా అనిపించింది...మరో సంబంధం చూళ్ళేకపోయారా?"

"ఏమిటనుకుంటున్నావోయ్! నా పేరు వెంకటరత్నం. ఇష్టమైతే ఇది చేసుకో. లేకుంటే నీకూ, నాకూ అంతే అన్నా. తెగతెంపులు చేసుకొని



Chhaya/PP/415

వెళ్ళింది. ఎంతైనా అది నా చెల్లెలే కదా!" అన్నాడు వెంకటరత్నం.

"కుర్రా డేదో చుట్టపుచూపుగా వస్తే పాత పురాణాలు తవ్వుతా రెందుకు?" అంది అత్తయ్య.

"చుట్టరికం కోసం మీ మరదలు ప్రయత్నం ఇదంతా. నాకు తెలియదనుకోకు! కానీ, వెంకటరత్నం సంగతి దానికి తెలియదు" అన్నాడు.

తర్వాత, "అలా తిరిగి వస్తా"నని బయలుదేరాడు. మఘయ్య మాటలు విన్న దగ్గరనించీ అతడి కొక పెద్ద రిలీఫ్‌గా ఉంది. లేకుంటే తను ఈ పల్లెటూరి అప్పలమ్మని పెళ్ళాడడం ఏమిటి. అమ్మది మరీ చాదస్తం. పిల్లని ఇవ్వనని ఎంత నిక్కచ్చిగా చెప్పాడు మఘయ్య! వంతమంటే అలా ఉండాలి. వంతానికి పోటీ పెడితే మఘయ్యదే ఫస్ట్ ప్రైజ్. మఘయ్య జిందాబాద్! మఘయ్య వంతంకూడా జిందాబాద్!

ఇంతకీ ఈ పల్లెటూరి అప్పలమ్మ ఒక్కసారైనా కనబడలేదే! ఇంకా నయం! కనబడి ఉంటే కతికిన పదార్థాలన్నీ వెలికి వచ్చి ఉండేవేమో!

పల్లెని వెన్నెల నైలాన్ కలలాగా పరుచుకుంది. వెన్నెల లేతకాంతిలో ప్రకృతి సంధించిన సమ్మోహనాస్త్రంలాగా ఉంది ఆ ఊరు. ఆ సౌందర్య భారంతో మనసు బరువెక్కగా ఇంటిదారి పట్టాడు.

జోళ్ళు విడిచి ఇంట్లోకి వెళుతుంటే, వెండి తీగెలమీద సాగిన మధుర నాదంలా సన్నగా పాట వినిపించింది. ఆశ్చర్యంతో పెరటివైపు నడిచాడు. చంద్రికలో తడిసిన ఆర్ద్రమైన పుష్పంలాగా ఆమె చావపై కూర్చొని పాట పాడుతోంది: "లోచనా! కమలలోచనా!"

అలికిడికి తల ఎత్తి చూసి—"రా, బావా! వెన్నెట్లో హాయిగా ఉంది! ఇక్కడ కూచో!" అంది.

"నువ్వు...మీరు...అత్తయ్య...మా.." ఆలోచనలు సరిగా అతకక వాక్యాలు తెగిపోయాయి.

"అమ్మ హరికథకి వెళ్ళింది. కాసేపట్లో వచ్చేస్తుంది. నాన్న మున్సబుతో మాట్లాడడానికి వెళ్ళాడు" అంది.

"అయితే...నువ్వు...అప్పలమ్మ...ఐ మీన్ నువ్వు..."

"అప్పలమ్మ ఎవరు? నా పేరు లక్ష్మి. రా. కూర్చో!" అంది.

మనసులో ప్రొఫెసరు మెదులుతున్నా కాళ్ళు అతన్ని చావదగ్గరికి ఈడ్చుకెళ్ళాయి. అదో రకం విభ్రమంతో చతికిలబడ్డాడు.

"ఇప్పుడు నువ్వు పాట పాడావుకదూ!" అన్నాడు కొత్త విషయాన్ని కనుక్కున్నట్టు.

"బాగుందా?" అని అడిగింది లక్ష్మి.

దీనికి జవాబులేదు. ఒక గాయకు డెవరో పాట పాడి చంద్రకాంతశిలను కరిగించినట్టు కృష్ణ మనసు ద్రవీభూత మవుతోంది.

"అత్తయ్య బావుందా?" అనడిగింది లక్ష్మి.

"నువ్వు అమ్మను చూడలేదుకదూ!"

"చిన్నప్పు డెప్పుడో చూశాను... అవునూ, అత్తయ్యకి పెద్దన్న అనే పేరు నచ్చదని అన్నా వెందుకూ?"

"నువ్వు విన్నా వేంటి?"

"ఊఁ!"

"పెద్దన్నకి టాబ్లెట్లు వేసుకునే అలవాటుందట. అది అమ్మకి తెలిసిపోయింది...అందుకూ!"

"టాబ్లెట్లా?"

"అవును. అతనూ, రాయలూ-అతని ఫ్రెండులో-ఇద్దరూ కలిసి ఒక్కొక్కరు పదేసి చొప్పున వేసుకొనేవారట!"

"అదేమిటి?"

"అందుకే అమ్మకి కోపం. రోజుకి తల కొక పది మాత్రల చొప్పున వేసుకుంటే-వాళ్ళ ఆరోగ్యం ఏపాటిదో తెలుస్తూనే ఉందిగా!"

"నువ్వు భలేగా మాటాడుతావే!" లక్ష్మి నవ్వింది.

అతడికి ఆమె నవ్వు బావుంది. ఈ ఊరు-బురదగుంటలున్నా-రంజుగా ఉంది. ఈ పెరడు ఆనంద సాగరంలా ఉంది. ఈ చావమీద కూర్చోవడం హుషారుగా ఉంది. లక్ష్మి ఉండడం ఇంకా ఇంకా ఆనందంగా ఉంది. ఎన్నో జన్మల కిందట తను పోగొట్టుకున్న తన వస్తువేదో తిరిగి దొరికినట్టుగా ఉంది. రాకెట్టుగాడికి లెంపకాయ ఇచ్చినంత సంతృప్తిగా ఉంది.

కానీ మఘయ్య ధోరణే బాధాకరంగా ఉంది. ఈ పెద్దవాళ్ళు అర్థంలేని వంతాలకి పోయి, చిన్నపిల్లల జీవితాలు నాశనం చేస్తారు కాబోలు!

భోజనా లయ్యాక మేఘ మెట్లెక్కి-కాదు, కాదు మేడమాలికలెక్కి-అదే అర్థమైందికదూ!-గదిలోనికెళ్ళి కూర్చున్నాడు. ఒక్కొక్క మెట్టు ఎక్కుతోంటే, అతడికి కొద్దికొద్దిగా కర్తవ్యం స్ఫురించింది. వంతగట్టు మఘయ్యలు-డౌన్, డౌన్! ఎంతటి విషానికైనా విరుగుడు ఉందట. మఘయ్య పట్టుదలకి తను విరుగుడు వేస్తాడు. వజ్రాన్ని వజ్రంతోనే కోయాలి. ముల్లుని ముల్లుతోనే తీయాలి.

కర్తవ్యం మార్గ నిర్దేశం చేయగా, మనసు మాధుర్యభారంతో నిండిపోయింది. అది కర్తవ్య దీక్షకి పదును పెట్టింది. అదేసమయానికి విధి రాకెట్టుని పంపించింది.

వాణ్ణి చూడగానే రాజుకి తను చేయవలసిన పని స్ఫురించింది. "ఒరేయ్! శీర్షాసనం వేసి చూపిస్తాను. ఇలా రా!" అని పిలిచాడు.


"వేస్తావా?"

"ఊఁ!"

"నువ్వు వెయ్యి! నేను నేర్చుకుంటా!" అన్నాడు రాకెట్.

"నీ దేబె మొహానికి శీర్షాసనంకూడానా! గూళ్ళకోసం, గుడ్లకోసం చెట్లవెంటా, గట్లవెంటా తిరిగే వెధవలకి శీర్షాసనం ఎందుకు!" భావతీవ్రత అధికమైనప్పుడు భాష తురంగంలా కదను తొక్కుతుందని ఊరికే అన్నారా?!

రాకెట్ గాడికి వాడి జీవితంలో మొదటిసారిగా




ఏమి జవాబు చెప్పాలో తెలియలేదు.

"వెర్రిమొహం వేసుకుని చూడటంకాదు. నేనెలా వేస్తానో గమనించు" అన్నాడు రాజు. ప్రింగుని బాగా నొక్కితే తప్ప అది తుళ్ళిపడదని అతడికి తెలుసు.

గది మధ్యలో శీర్షాసనం వేశాడు. "చూద్రా పుచ్చుపురుగా! ఇదీ పద్ధతి" అన్నాడు.

ఆ క్షణాన గాలిలో ఉన్న రాజు కాళ్ళని రాకెట్టుగాడు గట్టిగా పట్టుకొని బలంకొద్దీ తోసేసి పరిగెత్తాడు. ఆ తోపుకి రాజు నేలపై దభేలున పడ్డాడు. పెద్ద చప్పుడయింది.

చప్పుడు విని క్రింది నించి జనాభా అంతా పరుగెత్తుకు వచ్చారు. దారిలో వాళ్ళు-వ్యతిరేక దిశలో ఉపగ్రహ వేగంతో నిర్గమిస్తున్న రాకెట్‌ని కూడా వీక్షించారు. మేడపై గదిలో రాజు అచేతనంగా పడిఉండడానికి కారణం ఎవరో కూడా తెలిసిపోయింది వాళ్ళకి.

అనునయా లయాయి. సాంత్వన వాక్యాలయ్యాయి. ఉపచారా లయ్యాయి. రాకెట్ ఖండనం అయింది. "ప్చ్!" "అయ్యో!" మొదలైన ఉపశమన శబ్దాలు కూడా ఉచ్చరించడం అయింది. నాటు వైద్యుడికోసం కబురు పంపడమూ అయింది.

రాకెట్‌గాణ్ణి మరీ ఎక్కువగా రెచ్చగొట్టి ఉండకూడదు. వాడు తోసిన తోపుకి నడుందగ్గరా, మోకాలు ఎముకా నిజంగానే నొప్పిపెడుతున్నాయి. కళ్ళుమూసుకుని విశ్రాంతి తీసుకుంటున్నట్టు పడుకున్న రాజుకి పక్క గదిలోంచి లోగొంతుకలో మాటాడుతున్న మాటలు వినబడ్డాయి.

"అతి గారాబం చేసి వాణ్ణి జులాయి వెధవగా మార్చారు. చూశారుగా వాడు చేసిన నిర్వాకం! ఈ సంగతి రాజ్యానికి తెలిసిందంటే తన కొడుకుకి చేసిన మర్యాదకి ఇల్లుపీకి పందిర వేసేయగలదు. లేనిపోని పట్టింపులకి పోతే ఇలాంటి అఘాయిత్యాలే జరుగుతుంటాయి. తన కోపమె తన శత్రువని ఊరికే అన్నారా! నా మాట విని ఈ సంబంధం ఖాయం చెయ్యండి. అమ్మాయికి కూడా ఇష్టమేనట. అబ్బాయి లక్షణంగా ఉన్నాడు. బాంధవ్యమూ మిగులుతుంది, శ్రమా తప్పుతుంది."

స్వరోచి అనుకున్నాడు—'శభాష్, అత్తయ్యా! నీ లాగ మా కాలేజీలో ఎవరైనా లెక్చర్లివ్వగలిగితే నాకు ఫస్టుక్లాసు గారంటీగా వచ్చును.'

విజయగర్వంతో చిరునవ్వు నవ్వుతోన్న రాజుని కాఫీ తెస్తున్న లక్ష్మి చూసి అపార్థం చేసుకుంది: "బాధగా ఉందా, బావా?" అనడిగింది.

"అంత ఎక్కువగా (అమ్మా!) లేదులే, లక్ష్మీ! (హుఁ!) తగ్గిపోతుందిలే! (అమ్మా!)" మూలుగుతూ అన్నాడు రాజు.

"కావాలనే ఇది తెచ్చుకున్నావ్ కదూ!" అనడిగింది లక్ష్మి. ఆమె కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"ఎందుకూ? (అబ్బా!)" అన్నాడు.

"నాకోసం!"

"ఛ ఛ! ఎందుకా కంటతడి! నాకు బాగానే ఉంది. (అబ్బా!)" అన్నాడు.

లక్ష్మి నవ్వింది. ఆమె నవ్వుల సోపానాలపై కాలూని రసమయలోకంలోకి నడిచి వెళ్తున్నట్టనిపించింది స్వరోచికి. అక్కడ మసక మసగ్గా కనిపించే ప్రొఫెసరు మొహాన్ని చూస్తూ 'అయ్యా! మీరు నిష్క్రమించండి! మీకు ఇక్కడేంపనీ!' అని తను అంటున్నట్టుగా అనిపించింది. ★